సాక్షి
జోగులాంబ గద్వాల
శుక్రవారం । 26 । మే । 2023

గరిష్ఠం/కనిష్ఠం
38.8 /27.1
వాతావరణం
ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్, చిత్రంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు జీవన్‌రెడ్డి, వీహెచ్, పొన్నాల లక్ష్మయ్య, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మల్లురవి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి తదితరులు

హామీలన్నీ నెరవేరుస్తాం..

పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా.. సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు

- పేదల ఆకాంక్షల కోసం కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలి
- హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్
- 'ధరణి'ని బంగాళాఖాతంలో కలిపేస్తాం: సీఎల్పీ నేత భట్టి

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్/ రాజాపూర్: తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి అధికారంలోకి తీసుకువస్తే ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుక్కు అన్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 69వ రోజు గురువారం జడ్చర్లకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఏపీలో పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా.. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని, 70 ఏళ్ల కల సాకారం కోసం తెలంగాణలో 1,500 మంది ప్రాణత్యాగాలు చేశారన్నారు. అయితే ఏ లక్ష్యంతో తెలంగాణ సాధించుకున్నారో ఈ ప్రభుత్వంలో నెరవేరలేదన్నారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. మరో 5 నెలలు గడిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ లక్ష్యాలన్నీ సాధించుకుందామని, పేదల ఆకాంక్షల కోసం అధికారం అందించాలని కోరారు.

బాధితులకు న్యాయం చేస్తాం

ధరణిని తీసుకువచ్చి రూ.లక్షల కోట్ల విలువైన పేదల భూములకు ఎసరు పెట్టారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ధరణితో నష్టపోయి భూములు కోల్పోయిన వారందరికీ న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. తాను నిర్వహిస్తున్న పాదయాత్ర ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారం చేసేందుకేనన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణలో స్వేచ్ఛ, ఆత్మగౌరవం దెబ్బతిన్నాయన్నారు. దేశంలో, రాష్ట్రంలో స్వేచ్ఛ లేదని, భావస్వేచ్ఛ అసలే లేదన్నారు. ఎవరు మాట్లాడినా అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ దేని కోసం అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. కుర్చీ వేసుకుని పాలమూరు ప్రాజెక్టు కడతామన్న సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు ఎందుకు పూర్తిచేయలేకపోతున్నారని ప్రశ్నించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కోసం కనీసం భూసేకరణ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాలమూరు- రంగారెడ్డి పూర్తిచేస్తామన్నారు. ఉదండాపూర్ నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారంగా పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. బండమీదిపల్లిలో పేదల భూములు ధరణి కారణంగా మళ్లీ దొరల చేతికి వెళ్లాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ.5 లక్షలు ఇస్తామని, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందజేస్తామని, రేషన్ దుకాణాల్లో 9 రకాల నిత్యావసర సరుకులు ఇస్తామని, కూలిబంధు పేరుతో భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12 వేలు, 2 లక్షల ఉద్యోగాల భర్తీతోపాటు నిరుద్యోగులకు రూ.4 వేలు భృతి, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని ప్రకటించారు.



హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి తదితరులు

పాలమూరు అభివృద్ధిపై చర్చకు సిద్ధం: రేవంత్ -8లో

పేదలకు కార్పొరేట్ వైద్యం

అలంపూర్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం చేరువ చేయడం, అన్ని రంగాల్లో అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో రూ.57లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్టీఓ కార్యాలయం, ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాలసిస్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదలపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు డయాలసిస్ కేంద్రాలను ప్రారంభిస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం ఏడు మెడికల్ కళాశాలలు ఉండేవని, ప్రస్తుతం జిల్లాకు ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా చికిత్స పొందిన వారికి, చికిత్స పొందాల్సిన వారికి ఆర్థిక చేయుత అందజేస్తోందన్నారు. డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలాఉండగా, 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా మంజూరైన రూ. 35,04,060 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, తహసీల్దార్ సుభాష్ నాయుడు, నాయకులు అల్లబఖష్, వెంకటేశ్వర్లు, నర్సన్ గౌడ్, దేవరాజు, బీచుపల్లి నాయుడు తదితరులు ఉన్నారు.



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

5, 6న ప్లాట్ల బహిరంగ వేలం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అమిస్తాపూర్ సమీపంలోని సారిక, పోతులమడుగులోని టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లు పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో రూపొందించిన లే అవుట్లని అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. గురువారం కొత్త కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రీ-బిడ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 5న సారిక టౌన్‌షిప్‌లోని, 6న పోతులమడుగులో ఖాళీగా ఉన్న 193 ప్లాట్లకు జిల్లాకేంద్రంలోని బాదం సరోజని రామస్వామి ఆడిటోరియంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఈ రెండు చోట్ల అన్ని సౌకర్యాలతో పాటు జాతీయ రహదారికి దగ్గరగా ఉన్నాయన్నారు. సారిక టౌన్‌షిప్‌లోని ప్లాట్లు 60 చ.గ., మొదలుకొని 266 చ.గ., వరకు కనీస ధర రూ.7 వేలు, రూ.8 వేలుగా నిర్ణయించామన్నారు. పోతులమడుగు టౌన్‌షిప్‌లో 140 చ.గ., మొదలుకుని 400 చ.గ., వరకు కనీస ధర రూ.5,500, రూ.6 వేలుగా పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్ కింద రూ.పది వేలు డీడీ రూపంలో చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 08542- 241165, 76750 75365, 79934 55775లలో సంప్రదించవచ్చన్నారు. అలాగే వెబ్‌సైట్ https://mahabubnagar.telangana.gov.in లేదా unda.gov.in/auctions/tsiic.telangana.gov.in లేదా swagruha.telangana.gov.in లో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ భాస్కర్, బ్యాంకు అధికారులు, బిడ్డర్లు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,290

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు గురువారం 159 క్వింటాళ్ల వేరుశనగ రాగ, క్వింటాలుకు గరిష్ఠం రూ.7260, కనిష్ఠం రూ. 3172, సరాసరి రూ. 5430 ధరలు లభించాయి.అలాగే, 37 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్ఠం రూ. 5390, కనిష్ఠం రూ. 5040, సరాసరి రూ. 5370 ధర పలికింది. 943 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్ఠం రూ. 2059, కనిష్ఠం రూ. 1419, సరాసరి రూ. 2039 ధరలు వచ్చాయి. 51 క్వింటాళ్ళ వరి (హంస) రాగా, గరిష్ఠం రూ.1589, కనిష్ఠం రూ.1430, సరాసరిగా రూ. 1589 ధరలు వచ్చాయి.

బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: ఎంఆర్‌సీలో రెండు సంవత్సరాల ఒకే చోట సర్వీస్ పూర్తి చేసిన ప్రత్యేక అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏంఐఎస్ కోఆర్డీనేటర్లు, ఐఈఆర్‌పి, జిల్లా స్థాయి డాటా ఎంట్రీ ఆపరేటర్స్, సిస్టం అనాలసిస్ట్, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్స్ బదీల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని సూచించారు.

నేడు ఇళ్ల పట్టాల పరిశీలన

అలంపూర్: 2009 వరద బాధితుల ఇళ్ల స్థలాల పట్టాల విచారణ శుక్రవారం చేపట్టనున్నట్లు తహసీల్దార్ సుభాష్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వరద బాధితులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలను కలెక్టర్ ఆదేశాల మేరకు తిరిగి తీసుకోవడం జరిగిందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఎనిమిది బృందాల ద్వారా పట్టాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు విచారణ సమయంలో ఇళ్ల వద్ద ఉండి సహకరించాలని కోరారు.

30 నుంచి వృత్తి నైపుణ్య పరీక్షలు

గద్వాల వ్యవసాయం: శ్రీచెన్నకేశవ మత్స్యపారిశ్రామిక సహకార సంఘంలో కొత్తగా మత్స్యకారులకు సభ్యత్వం ఇచ్చేందుకు ఈనెల 30వ తేదీ నుంచి గద్వాల పట్టణంలో వార్డుల వారీగా వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి షకీలాభానో ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు కులానికి చెంది, గద్వాల నివాసితులై, బీపీఎల్ కుటుంబాలకు చెందిన వారు, ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం లేని వారు అర్హులుగా పేర్కొన్నారు. ఈనెల 30న 4, 5, 6 వార్డులు, 31న 7 ,8, 9 వార్డులు, జూన్ 1న 10,11, 12వార్డులు, 2న 13,14,15 వార్డులు, 3న 16,17, 18వార్డులు, 4న 19,20,21వార్డులు, 5న 22,23, 24 వార్డులు, 6న 25,26,27 వార్డులు, 11న 28,29,30 వార్డులు, 12న 31,32,33 వార్డులు, 13న 34,35,36,37వ వార్డుల వారికీ వృత్తి నైపుణ్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. హాజరయ్యే మత్స్యకారులు విపురు వల, పుట్టి, వేలముబద్ద వెంట తెచ్చుకోవాలని, అదేవిధంగా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని సూచించారు.



సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

హైదరాబాద్‌లోని కొత్త సచివాలయంలో గురువారం సీఎం కేసీఆర్ నిర్వహించిన సమీక్ష సమావేశానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ సృజన హాజరయ్యారు.
- గద్వాల రూరల్

క్లుప్తంగా

చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి


కృష్ణయ్యగౌడ్ (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో తాటిచెట్టు పైనుంచి పడి గీతా కార్మికుడు కృష్ణయ్యగౌడ్(53) మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కులవృత్తిలో భాగంగా కృష్ణయ్యగౌడ్ రాత్రి వేళలో తాటిచెట్టు పైకి ఎక్కి కల్లు తీస్తుండగా.. తాను కట్టుకున్న మోకుతాడు తెగిపోవడంతో చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలియజేశారు.

ఇంట్లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: అనారోగ్య సమస్యలతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఏనుకొండ కాలనీకి చెందిన రంజిత్ కుమార్(30) పే అండ్ అకౌంట్స్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ.. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతడు చాలా రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన రంజిత్ కుమార్ బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి..


మాల శేకర్(ఫైల్)

ఉండవెల్లి: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ప్రాగటూరులో చోటుచేసుందని ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. గురువారం ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రాగటూరుకి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు మాలశేఖర్ అలియాస్ బేతి శేఖర్(26) మంగళవారం మద్యం తాగడానికి తల్లిని డబ్బులు అడిగాడు. దీంతో తల్లి మందలించింది. అప్పటికే అతను పురుగు మందు తాగాడు. కుమారుడి నోటిలో నుంచి నురుగ రావడాన్ని గమనించిన తల్లి వెంటనే ప్రైవేటు వాహనంలో కర్నూల్ ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇతను ప్రాగటూరులో పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తుండేవడని తెలియజేశారు.

కుటుంబ కలహాలతో మహిళ..

కొత్తకోట: మండల పరిధిలోని నిర్విన్‌కి చెందిన శశికళ(28) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. మృతురాలు శశికళ భర్త శివ కొంత కాలంగా వ్యసనాలకు అలవాటు పడి రూ.10 లక్షలు అప్పు చేయడంతో తరుచుగా భార్యాభర్తలు గొడవ పడుతుండేవారు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శశికళ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుదాటుతున్న వృద్ధురాలిని వేగంగా..నిర్లక్ష్యంగా క్రేన్ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వన్‌టౌన్ ఎస్‌ఐ జగన్నాథం కథనం ప్రకారం.. పాత పాలమూరుకు చెందిన చెన్నమ్మ(78) గురువారం మధ్యాహ్నం సమయంలో పాత పాలమూరు ఎక్స్‌రోడ్ దగ్గర మెడికల్ దుకాణంలో బీపీ ట్యాబ్లెట్స్ తీసుకుని రోడ్డు దాటుతుంటే మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్ వెళ్లే హెచ్‌ఆర్ 38 టీఈ 3345 నంబర్ కలిగిన హైడ్రా క్రేన్ వాహనం ఢీకొట్టడంతో మృతి చెందింది. తల పగిలిపోవడంతో పాటు శరీరం సైతం నుజ్జునుజ్జు అయింది. మృతురాలి మనువడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హంస ధర రూ.1,559

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ఈనామ్ టెండర్లలో హంస ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,559, కనిష్టంగా రూ.1,501 పలికింది. అలాగే సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,063, కనిష్టంగా రూ.1,662, ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,329 చొప్పున లభించాయి.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం: రేవంత్


జడ్చర్లలో బహిరంగసభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్/ రాజాపూర్: జడ్చర్లలో జరిగిన బహిరంగసభలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న లక్ష్మారెడ్డి ఇప్పటి వరకు 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించుకోలేకపోయారని, ప్రభుత్వ ఆస్పత్రిలో జనరేటర్ లేదని ఎద్దేవా చేశారు. కానీ, రియల్ వ్యాపారం మాత్రం జోరుగా చేస్తున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. పిల్లలమర్రి నుంచి ప్రాజెక్టుల దాకా అంబేడ్కర్ సాక్షిగా ఎక్కడైనా చర్చకు సిద్ధమన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలతోపాటు 2 ఎంపీ స్థానాలను గెలిపించి తనను ఆశీర్వదించాలని కోరారు.

☛ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ మిడ్జిల్ మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇసుక దందాకు పాల్పడుతున్నారని, భూ ఆక్రమణలు చేస్తున్నారని విమర్శించారు. ఊర్కొండలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించలేదని, రాజాపూర్ మండలంలో రైతులకు రుణమాఫీ జరగడం లేదని, బ్యాంకుల నుంచి నోటీసులు అందాయని ఆరోపించారు. జడ్చర్లలో రోడ్డు పక్కన ఇళ్లు కోల్పోయిన వారికి ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. బాలానగర్–పెద్దరేవల్లికి బీటీరోడ్డు లేదని, భూములు కొన్న ప్రాంతంలో మాత్రం రోడ్లు వెలిశాయన్నారు.

ఆకట్టుకున్న గద్దర్ ఆటాపాట

బహిరంగ సభ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆటపాట ఆకట్టుకుంది. కళాజాతా బృందంతో కలిసి ఆయన ఆడిపాడారు. బహిరంగ సభలో నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్లు రవి, నాగం జనార్దన్‌రెడ్డి, చిన్నారెడ్డి, సంపత్‌కుమార్, బల్మూరి వెంకట్, వి.హన్మంతురావు, రాములునాయక్, వంశీచంద్‌రెడ్డి, ఎర్రశేఖర్, శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గద్దర్ ఆటాపాట

సైడ్‌లైట్స్

☛ సభలో భట్టి విక్రమార్క ప్రసంగిస్తుండగా సీఎం.. సీఎం అంటూ కొందరు యువకులు నినాదాలు చేశారు.

☛ ముఖ్య వక్తలు చేసిన ప్రసంగంలో రేవంత్‌రెడ్డి పేరు ప్రస్తావించిన ప్రతిసారి ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది.

☛ సభ నిర్వహణపై హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి నుంచి ముఖ్యులందరూ అనిరుధ్‌రెడ్డిని ప్రశంసించారు.

☛ వేరు వేరు దుకాణాలు వద్దు.. కలిసి పనిచేయాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను ఉద్దేశించి వి.హన్మంత్‌రావు చేసిన వాఖ్యలతో సభలో ఒక్కసారిగా హర్షధ్వానాలు వినిపించాయి.

☛ వీఐపీ పాసులు లేవని ప్రజలను వదలకపోవడంతో పదే పదే స్టేజీపై నుంచి పోలీసులకు విజ్ఞప్తులు చేయాల్సి వచ్చింది. 5 నెలలు ఆగితే అధికారంలోకి వచ్చేది తామేననే విషయం గుర్తుంచుకోవాలని పోలీసులకు సూచించారు.

కోమటిరెడ్డి వ్యాఖ్యలపై చర్చ

పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బహిరంగ సభలో నల్లగొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జ్‌గా ఉన్న సమయంలో నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా చేశారని, ప్రస్తుతం టికెట్ ఇవ్వాల్సింది టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డే అని, రేపు అనిరుధ్‌రెడ్డికి టికెట్ ఇస్తారని వ్యాఖ్యానించారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి న్యాయం చేయాలని, చేస్తామని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

పొల్ట్రీఫాంలో నమూనా సేకరణ



పౌల్ట్రీఫాంలో తనిఖీ చేస్తున్న అబ్కారీశాఖ అధికారులు,సీజ్ చేసిన శ్రీకాంత్‌రెడ్డి కారు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం శివారులో గల పౌల్ట్రీఫాంలో అల్ప్రాజోలం తయారీ కేంద్రంపై డీఆర్‌ఐ అధికారుల దాడులు, విచారణ అనంతరం నాగర్‌కర్నూల్ అబ్కారీశాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించి నమునాలను సేకరించారు. అబ్కారీశాఖ నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయమే పౌల్ట్రీఫాంకు చేరుకుని తనిఖీ చేపట్టారు. మిగిలిపోయిన ద్రావణాలను, ఏక్సామిన్ అనే సీహెచ్ పొడర్‌ను సేకరించారు. అల్ప్రాజోలం తయారీ కోసం వినియోగించే పిప్పెట్, స్టాండ్, పలు పరికరాలను పరిశీలించారు. ఈ షెడ్ లోపల ఆ డ్రగ్‌కు సంబంధించిన ఫార్ములా తెలుసుకుని ల్యాబ్‌ను ఏర్పాటు చేశారని, ల్యాబ్‌ను ఒక శాస్త్రవేత్త సాయంతో నిర్వహించి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అప్పటికే కేంద్రానికి చెందిన డీఆర్‌ఐ శాఖ విలువైన యంత్రాలను, ద్రావణాలను, వస్తువులను సేకరించారన్నారు. పౌల్ట్రీషెడ్‌లో శ్రీకాంత్‌రెడ్డికి చెందిన కారును సీజ్ చేసినట్లు అధికారులు నోటీసులు అంటించారు. డీఆర్‌ఐ అధికారులు శ్రీకాంత్‌రెడ్డికి చెందిన పౌల్ట్రీఫాం పక్క పొలం రైతుల్ని, ఇతర పౌల్ట్రీఫాం నిర్వాహకుల్ని విచారించారు. ఈ షెడ్ వద్దకు రాకపోకలు నిర్వహించే స్థానిక వ్యక్తులు, స్థానికేతరులు, వారి వివరాలు, వాహనాల వివరాలు, నిర్వాహకులతో సంబంధం ఉన్న వాటిని విచారించారు. విచారణలో భాగంగా షెడ్ నుంచి కొన్ని సార్లు మురుగు వాసన పెద్ద మొత్తంలో వచ్చేదని, తాగునీటి కోసం ఎవరైనా రైతులు వస్తే వారిని వారించే సందర్భాలు ఉన్నాయని అధికారుల విచారణలో తేలింది. కాగా ఈమొత్తం వ్యవహారంలో డీఆర్‌ఐ అధికారులు ఎలాంటి విచారణ చేశారు, ఎవరిని అదుపులోకి తీసుకున్నారు, ఏమి స్వాధీనం చేసుకున్నారనే సమాచారం కూడా తమకు లేదని, అధికారులే త్వరలో అన్ని వివరాలు వెల్లడించవచ్చని నాగర్‌కర్నూల్ అబ్కారీ ఎస్‌ఐ చెప్పారు.

తెల్లారితే పెళ్లి.. వరుడు పరార్

- బంధువులతో కలిసి పందిరి పనుల్లో పాల్గొన్న వరుడు
- కోస్గికి వెళ్లి వస్తానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్
- అర్ధాంతరంగా ఆగిన పెళ్లి

కోస్గి: తెల్లారితే పెళ్లి.. బంధువులంతా ఒక్కొక్కరు చేరుకుంటున్నారు. అంతలోనే బయటకు వెళ్లి వస్తానని చెప్పిన వరుడు ఏ కారణం చెప్పకుండానే అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు ఫోన్‌లో మాట్లాడిన ఇదిగో వస్తున్న, అదిగో వస్తున్న అంటూ చివరకు ఫోన్ ఆఫ్ చేయడంతో తెల్లారితే జరగాల్సిన పెళ్లి ఆగిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు.. మండలంలోని హన్మన్‌పల్లికి చెందిన గోపాల్ తన కుమారుడు మధుకు వికారాబాద్ జిల్లా యాలాల్ మండలంలోని ఓ అమ్మాయితో పెళ్లికి నిశ్చయించారు. ఇరువైపులా బంధువులు సమ్మతమై కట్న కానుకలు మాట్లాడుకుని, ఈ నెల 25న వరుని స్వగ్రామంలో పెళ్లి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. 24న బుధవారం బంధువులు, గ్రామస్తులతో కలిసి పెళ్లి కొడుకు సైతం పందిరి వేసే పనుల్లో ఉత్సాహంగా పాల్గొన్నాడు. పందిరి పనులు ముగియగానే అందరితో కలిసి భోజనం చేశాడు. ఓ వైపు పందిట్లో పెళ్లి కొడుకును చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో కోస్గికి వెళ్లి వస్తానని చెప్పి పోయాడు. తొందరగా రావాలని కుటుంబ సభ్యులు ఫోన్‌లు చేయగా ఇప్పుడే వస్తున్నా అంటూ కాలయాపన చేశాడు. సాయంత్రం కావడంతో పెళ్లి కొడుకుని చేసి పెళ్లి కూతురును తీసుకువద్దామని కుటుంబ సభ్యులు కోస్గికి వచ్చి మధు కోసం వెతికినా జాడ దొరకలేదు. హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అతడు హైదరాబాద్‌లో ఉన్నట్లు మొదట గుర్తించారు. కొందరు బంధువులు హైదరాబాద్‌కు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసుల సాయంతో పెళ్లికొడుకు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. గురువారం జరగాల్సిన పెళ్లి అర్ధాంతరంగా నిలిచిపోవడంతో, పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు ఇంట్లో ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది.

ఇద్దరు పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ



పీహెచ్‌డీ స్వీకరిస్తున్న శంకర్, రామకృష్ణ

జడ్చర్ల టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో వృక్షశాస్త్ర అధ్యాపకుడు డా.సదాశివయ్య నేతృత్వంలో పరిశోధన జరిపిన రామకృష్ణ, శంకర్‌లకు గురువారం పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం నుంచి ఆచార్య నిర్మలాబాబురావు పర్యవేక్షణలో పరిశోధనలు జరిపినందుకుగానూ వారికి ఆమె పీహెచ్‌డీ ప్రదానం చేసి అభినందించారు. నల్లమల అటవీ ప్రాంతంలో మొక్కల గణన, వైవిద్యం, అటవీ నిర్మాణం అనే అంశం మీద రామకృష్ణ పరిశోధనలు చేశారు. అందులో భాగంగా 872 జాతుల మొక్కలను గుర్తించారు. వాటిలో 162 వృక్షాలు, 76 పొదలు, 116 తీగలు, 522 గుల్మాలు ఉన్నాయని గుర్తించారు. అలాగే రాష్ట్రంలో 22 మొక్కలను, 84 స్థానీయ మొక్కలు, అంతరించిపోతున్న 36 మొక్కలను గుర్తించారు. యూఫోర్బియా తెలంగాణేన్సిస్ అనే కొత్తమొక్కను డా.సదాశివయ్యతో కలిసి ప్రపంచానికి అందించారు. నల్లమల అటవీ ప్రాంతంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో వృక్షాల జీవిత చక్రంపై పరిశోధన చేసినందుకు శంకర్‌కు పీహెచ్‌డీ లభించింది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ..


మాట్లాడుతున్న శంకర్ యాదవ్


వాటర్‌ట్యాంక్‌పై శంకర్‌యాదవ్

వాటర్‌ట్యాంక్ ఎక్కి ఉపసర్పంచ్ హల్‌చల్

- అధికారుల హామీతో విరమణ

చిన్నచింతకుంట: మూడేళ్ల కిందట నిర్మించిన వైకుంఠధామం బిల్లులు చెల్లించాలంటూ మండలంలోని కురుమూర్తికి చెందిన ఉపసర్పంచ్ శంకర్‌యాదవ్ గురువారం వాటర్‌ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలో వైకుంఠధామం నిర్మాణాన్ని ఉపసర్పంచ్ పూర్తి చేశారు. పలుమార్లు బిల్లుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో గురువారం కురుమూర్తి ఆలయ ప్రాంగణంలో ఉన్న మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకుపైకి ఎక్కి ఆత్మహత్యా చేసుకుంటానని హల్‌చల్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ తిరుపతయ్య, ఎస్‌ఐ మోహన్‌బాబు ఘటన స్థలానికి చేరుకొని కిందకు దిగాలని కోరారు. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కిందకు దిగనని అక్కడే బైఠాయించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పదిరోజుల్లో మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ మాట్లాడుతూ.. అప్పు చేసి నిర్మాణం చేపట్టానని, త్వరగా బిల్లులు మంజూరుచేసి ఆదుకోవాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. క్రిమిటోరియానికి సంబంధించిన ఎంబీ రికార్డు లేదని.. బిల్లులు చేయలేమని పంచాయతీరాజ్ ఏఈ చెప్పారని, అసలే పూటగడవని పరిస్థితి ఉందని, తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పెండింగ్‌లో ఉన్న రూ.4 లక్షలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు.

బీజేపీ నాయకుల నిరసన..

శంకర్‌యాదవ్ పెండింగ్ బిల్లులు మంజూరుచేసి ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నంబి రాజు, నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్ డిమాండ్ చేశారు. గురువారం కురుమూర్తి ఆలయ సమీపంలోని ఆత్మకూర్– దేవరకద్ర రహదారిపై పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.

790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం ఎగువ ప్రాంతం నుంచి 790 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు కాగా.. 7.553 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 153 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

■ రామన్‌పాడు జలశయంలో గురువారం పూర్తి నీటిమట్టం 1,019 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వకు వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వను నీటిని విడుదల చేయడం లేదు. తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ఎంసెట్‌లో 'ప్రతిభ' విజయకేతనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అగ్రికల్చర్ విభాగంలో రిజ్వాన్ 268, వరుణ్‌కుమార్ 407, మేఘన 786, శ్రీవర్ధిని 862, కే.మహతి 981, స్వాతి 1,105, వన్షికారెడ్డి 1,397, యశ్వంత్‌రెడ్డి 1,630, పావని 1,809, తబస్సుమ్‌సుల్తాన 1,927, సాయిసుదీక్ష 2,053 ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఇబ్రహీం 377, నిఖిలేష్‌కుమార్ 1,659, పూజిత 1,909, తనుశ్రీ 2,196, సుప్రత 2,879, సాయికేతన్‌రెడ్డి 3,280 ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. వీరితో పాటు అగ్రికల్చర్, ఇంజినీరింగ్‌లో మరింత మంది ర్యాంకులు సాధించారు. కార్యక్రమంలో కళాశాల సలహాదారు మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో 'రిషి' ప్రభంజనం


విద్యార్థులతో రిషి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంసెట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బైపీసీ విభాగంలో మౌర్య 349, క్రితిక్‌తేజా 382, శివకుమార్ 442, యుగంధర్‌యాదవ్ 626, భానురేఖ 951 ర్యాంకులు సాధించారు. 5వేలలోపు 47 మంది ర్యాంకులు సాధించారు. వీరితో పాటు ఎంపీసీ విభాగంలో కౌశిక్‌యాదవ్ 1,155, శ్రీనివాస్ 1,314, వరప్రసాద్‌రెడ్డి 1,783 ర్యాంకులు సాధించారు. వీరితో పాటు 5వేలలోపు 16 మంది ర్యాంకులు సాధించారు. కళాశాల సలహాదారు వెంకటయ్య మాట్లాడుతూ కళాశాలలో మెరుగైన విద్య అందించినందుకు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని, ఘన విజయానికి కృషి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులను అభినందించారు.

చికిత్సపొందుతున్న ఉద్యమకారుడు మృతి


పులికల్ దేవన్న (ఫైల్)

అలంపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు పులికల్ దేవన్న గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయిజ మండలం పులికల్‌కు చెందిన దేవన్న ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ గురువారం చెందినట్లు వివరించారు. దేవన్నకు భార్య, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. అయిదుగురి వివాహాలు అయ్యాయి.

దేవన్న మృతి బాధాకరం..

తెలంగాణ ఉద్యమకారుడు దేవన్న మృతి బాధకరమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. తన ఉద్యమ సహచరుడిని కోల్పోవడం కలిచి వేస్తోందని.. బాధిత కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు.

సత్తాచాటిన 'శ్రద్ధ' విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ జగపతిరావు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని శ్రద్ధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని చైర్మన్ జగపతిరావు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో మణికంఠ 2,344, సాన్వి 6,841 ర్యాంకులు సాధించగా, అగ్రికల్చర్‌లో చరణ్ 5,047, సోహెల్ 8,111 ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, మధుమోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'వాగ్దేవి' విజయ దుంధుబీ


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు విజయదుంధుబీ మోగించారు. అగ్రికల్చర్ విభాగంలో వరుణ్‌కుమార్ 407, నితిన్ 3,602, అఖిల 5,476, చైతన్య శ్రీ 7,343, అనూష 8,923వ ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో సింధురెడ్డి 7,343, శ్రీకరన్‌రెడ్డి 7,857 ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సూచించారు. ప్రిన్సిపాల్ గీతాదేవి, అకాడమిక్ ఇన్‌చార్జ్ పావని, ఎంసెట్ ఇన్‌చార్జ్ షాకీర్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై కత్తితో దాడి


గాయపడిన బిచ్చమ్మ

కోడేరు: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి వృద్ధురాలిపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన మండలంలోని మాచుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన శివుడు మద్యానికి బానిసయ్యాడు. నిత్యం గొడవ పడుతుండటంతో వేధింపులు భరించలేక భార్యాపిల్లలు తల్లిగారి ఇంటికి వెళ్లిపోయారు. దీంతో తల్లితో కలిసి ఇంట్లో ఉండేవాడు. పక్కింట్లో ఉండే వృద్ధురాలు తాగి సంసారం నాశనం చేసుకోవద్దని మందలించింది. గురువారం ఉదయం తల్లిని డబ్బులు ఇవ్వాలని అడగగా లేవని చెప్పడంతో కోపంతో అదే సమయంలో ఆరుబయట నిద్రిస్తుండగా బిచ్చమ్మపై కత్తితో దాడి గొంతుకోశాడు. ఆమె లేచి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వెంటనే అక్కడికి చేరుకొని దేహశుద్ధి చేశారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.